గోవిందా హరి గోవిందా!

- వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు
- వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం గుండా శ్రీవారి దర్శనం
- ఆలయాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు

చిక్కడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని తెల్లవారుజాము నాలుగున్నర గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు సర్వదర్శనంతో పాటు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించడంతో భక్తులు క్యూలైన్లలో వడివడిగా స్వామివారి దర్శనానికి వెళ్లారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంప్ ఏర్పాటుతో పాటు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. దాదాపు 80 వేల మంది భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నట్లు ఆలయ సిబ్బంది అంచనా వేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, పోలీస్ ఉన్నతాధికారి ఐజీ సుమతి, కార్పొరేటర్ రవిచారి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్ గౌడ్, ఈఓ ఎస్. అన్నపూర్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


వైకుంఠ ఏకాదశి సందర్భంగా గోల్నాక డివిజన్ ఛేనంబర్‌లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాలేరు పద్మ దంపతులు. పాల్గొన్న ఆలయ కమిటీధర్మకర్త రావి కమలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కదురు శివరామకృష్ణ తదితరులు


ఆర్టీసీ క్రాస్‌రోడ్ లోని పంచముఖ ఆంజనేయ ఆలయంలోని వేంకటేశ్వర స్వామి మందిరంలో ఉత్తర ద్వారదర్శనం చేసుకుంటున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు తదితరులు


చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు


చిక్కడపల్లిలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేష్, శ్యామ్ తదితరులు


అంబర్‌పేట సీపీఎల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌రెడ్డి దంపతులు


చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు


గాంధీ నగర్ సంఘమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన భక్తులు


రాంనగర్ రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, మోహన్‌రెడ్డి తదితరులు

సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయి

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

చిక్కడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌లు అన్నారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ నేత, మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బన్సీలాపేట వికలాంగుల ఆశ్రమంలో, గాంధీ ఆస్పత్రి, చార్మినార్‌ల వద్ద పేదలకు అన్నదానం, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను రోహిత్‌రావు, దయానంద్‌లు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చేరువ చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు పాశం అనిల్ యాదవ్, జగదీశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాబూరావు, బాబ్జీ, టోనీ, సురేష్‌యాదవ్, రమేష్‌యాదవ్, వినయ్, బిపిన్, మారిశెట్టి నర్సింగ్, శివ, చిన్నయాదవ్, సాయిసురేష్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు ప్రదానం చేస్తున్న అతిథులు

ఘనంగా పీవీ రామారావు శతజయంతి మహోత్సవం

చిక్కడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్వర్ణయుగం చిత్రదర్శకుడు, భక్త జయదేవ చిత్ర రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ రామారావు శతజయంతి మహోత్సవాన్ని త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి ఆయన కుటుంబసభ్యులు నిర్వహించారు. పీవీ రామారావు జీవితచరిత్ర గ్రంథాన్ని ఫ్యాక్టరీస్ రిటైర్డ్ డైరెక్టర్ పీవీ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. నిర్వహణాసంస్థ ఘంటసాల గానసభ ప్రతినిధి డా. కేవీ రావు అధ్యక్షతన జరిగిన సభలో చిత్ర నిర్మాత డీవీకే రాజు, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, బి.అక్కిరాజు, రచయిత, నిర్మాత బీవీ రాజు, సముద్రాల విజయరాఘవాచారి, టీవీఆర్‌కే మూర్తి, డా. శారద తదితరులు మాట్లాడుతూ పీవీ రామారావు దర్శకత్వ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు బాలకామేశ్వరరావుకు పీవీ రామారావు, పద్మశ్రీ ఘంటసాల స్మారక జీవన సాఫల్య పురస్కారం 2025, ప్రముఖ గాయని వైవీఎస్ లక్ష్మీరమకు పీవీ రామారావు డా. భానుమతిరామకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం 2025 బహూకరించారు. హృషికేష్, వాణీకుమారి, మోనిక, రవీందర్‌లు గీతాలు ఆలపించారు.



విద్యార్థులకు డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న ఉన్నత విద్యామండలి ప్రొ. బాలకిష్టారెడ్డి

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డి

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సముద్ర గర్భం పరిశోధన నుంచి అంతరిక్ష పరిశోధన వరకు వారిదే ముందంజ అని అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినులు పోటీతత్వాన్ని పెంపొందించుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.శశికాంత్, రెడ్డి ఉమెన్స్ కళాశాల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతదేవి, టి.వాణిమాధవి పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచడానికి పటిష్ట చర్యలు

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శి డాక్టర్ జ్యోష్ణదేవి అన్నారు. శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. మానసిక ఒత్తిడి లేకుండా విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసే విధంగా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. టెలీమానస్ హెల్ప్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసే విధంగా అధ్యాపకులకు ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, గీతాబాయ్, వి.ప్రసాదరావు, రామ్మోహన్, నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య, సురేష్, బాలమణి, రజనీ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

- ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్ యాదవ్ తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్ని సందర్భాలలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కాచిగూడలో ఆయన విలేకరుల మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదించి ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముందుగా కాచిగూడ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశామన్నారు. గ్రేటర్ పరిధిలోని 150 మున్సిపల్ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ త్యాగరాయగానసభలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త జి. మల్లేష్‌కు సేవారత్న, ప్రముఖులు పార్వతి ప్రమీల, ప్రతిభలకు మహిళారత్న పురస్కారాలను ఆయన ప్రదానం చేశారు.

కాంగ్రెస్ నేతల అత్యుత్సాహం

- ఫ్లెక్సీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫొటో

నల్లకుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. బతుకమ్మ కుంటపై హైకోర్టు తీర్పు ఇవ్వడం హైడ్రా కమిషనర్ రంగనాథ్ బతుకమ్మకుంటను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి ఫొటోల సరసన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫొటోను వేశారు. ఈ ఫ్లెక్సీలు చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. హైడ్రా కమిషనర్‌కు కాంగ్రెస్ పార్టీతో సంబంధం ఏమిటని పలువురు చర్చించుకున్నారు.



కాంగ్రెస్ నేతల సరసన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫొటో

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద యువతుల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 77 మందికి కల్యాణలక్ష్మి, 120 మందికి షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఆయన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, ముషీరాబాద్ తహసీల్దార్ కె రాణా ప్రతాప్ సింగ్‌లతో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠాజైసింహ, బీజేపీరాష్ట్ర నాయకులు జివెంకటేష్, నవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియా నవీన్‌గౌడ్ తదితరులు

పేద బ్రాహ్మణ విద్యార్థులకు త్వరలో స్కాలర్‌షిప్‌లు

- మంత్రి శ్రీధర్‌బాబు

రాంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విదేశీ విద్యనభ్యసిస్తున్న పేద బ్రాహ్మణ విద్యార్థులకు త్వరలో స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీని మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ సుశీల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీలకంఠం, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, ప్రతినిధులు సీతారాం, సీవీ రాంచందర్‌రావు, వేదాంతం పవన్‌కుమార్, రాఘవేందర్ రావు, వైద్యనాథ్, యమునపాఠక్, అనురాధ, డాక్టర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

క్యాలెండర్ల ఆవిష్కరణ



రాంనగర్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కల్లు గీత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆయిలి వెంకన్న గౌడ్, హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు యేలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



రాంనగర్, (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీ సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు అతినగరం సుధేష్ ఆధ్వర్యంలో రాంనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్, మినరల్ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, శ్రీగణేష్ ఆలయం మాజీ చైర్మన్ ఎస్.జయరాజ్, సంఘం నాయకులు ఎం.దశరథ్, బొడ్డు తిరుపతి, బి.సతీష్, ఊర్మిళ, రూప, నిర్మల, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం

ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో 48 గంటల దీక్ష

- టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో 48 గంటల దీక్ష నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. వర్గీకరణ అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని, అందువల్ల పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్, రమేష్, శ్రీనివాస్, నర్సింహ, యాదయ్య, చందు, సంజీవ, అంజయ్య, యాదగిరి, హుస్సేన్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి

కవాడిగూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్దన్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడలోని ఓ పాఠశాలలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో ఆయన పాల్గొని చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా వివిధ వేషధారణల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులకు చిన్ననాటి నుంచే మన పండుగలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలపై అవగాన కల్పించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, రఘురామ్‌రెడ్డి తదితరులు

లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర డైరీని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆవిష్కరించారు. కార్యక్రమంలో లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రఘురామ్‌రెడ్డి. ప్రధానకార్యదర్శి ఎం మధుసూదన్, ఉపాధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి, రంజిత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ డేలో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

రాంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థుల పరేడ్‌లో పాల్గొని మాట్లాడారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకునే తత్వాన్ని నేర్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడల్లో రాణించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, వైస్ ప్రిన్సిపాల్స్ కుమారస్వామి, డాక్టర్ శ్రీధర్, హెచ్ఓడీలు వేమన రెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీపడాలి

ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీపడి రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పీజీ కళాశాల విద్యార్థుల స్పెషల్ డే వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వై.విష్ణుప్రియ, కళాశాల ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప కథనం ప్రకారం. ఉప్పుగూడ - యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 60 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వృద్ధుడు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362